# ప్రమిద

- ఐ.ఎమ్.ఎ. సోవనీర్, 1992

---

**కాలం మారేకొందీ... మనుషులూ మారడం అవసరం. లేకపోతే... తోటివారితో పరుగుపందెంలో వెనకపడిపోవడం ఖాయం.**

---

పేషెంట్‌ని పరీక్షచేసి, ప్రిస్క్రిప్షన్ యిచ్చాను. ఆమె లేచి నిల్చుంది కానీ కదిలి వెళ్ళలేదు.

"మీ ఫీజ్....!" బెరుగ్గా అడిగింది. ప్రతిసారీ ఫీజ్ కట్టకుండా వెళ్ళడం ఆమెకు చిన్నతనమనిపించి అడిగిందే కానీ, నాకివ్వాల్సిన ఫీజ్ పర్సులో లేదని నాకు తెలుసు.

"పర్వాలేదులే! మీ ఆయనకు ఉద్యోగం వచ్చాక... ఇద్దూగాని..." ఈ చిన్న సానుభూతికే ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. కృతజ్ఞతగా నావైపు చూసి వెళ్ళింది.

నన్ను పలకరించడానికొచ్చి, నా ఎదురుగా కూర్చేనున్న నా స్నేహితురాలు జయ కుతూహలంగా అడిగింది.

"ఎవరామె.....?"

"ఏమో! పేషెంటుగా తెలుసంతే.....!"

"ఆమె భర్తకు ఉద్యోగం లేకపోవడం... ఈమె నిజమే చెబుతోందంటావా?"

"ఆమె కన్నీళ్ళు అబద్ధం చెప్పవుకదా!"

"ఓ.కె.! మరి ఈమె ఏం పని చేస్తోంది?"

"ఈమా? ఉహుం ఏమీలేదు...."

"హు! నాకు తెలుసు. తెలిసే అడిగాను...." జయ గొంతులో కనపడని కఠినత్వం... ఆ శబ్ద భావం నాకు అర్థం కాలేదు. మరో పేషంటును రమ్మన్న సూచనగా, నా చెయ్యి బెల్‌మీదకు వెళ్ళింది. జయ చెయ్యి నా చేతిమీద పడింది.

"జ్యోతీ....!" ఏమిటన్నట్టు చూసాను. "ఒక రిక్షా అతను తన భార్యను ప్రైవేట్‌గా, నీచేత కాన్పు చేయించుకుంటున్నాడు ఎలా?"

"అదీ నువ్వే చెప్పు!" నా టేబుల్ సర్దుకుంటూ అన్నాను.

అతని భార్య కూడా, అతనితో సమంగా ఏదో పని చేస్తోంది కాబట్టి.

"పాపం, వీళ్ళు బాగా బ్రతికి చితికినవాళ్ళే జయా!" వెంటనే అన్నాను.

"అయితే, ఏ పనీ చేయకుండా, ఇలా శరీరాన్నీ.... మనసునీ కృంగదీసుకోవాలా?"

"పనా? ఎవరిస్తారు పని? వీళ్ళాయననే వూరిస్తోంది.... గవర్నమెంటు ఉద్యోగం. ఆరేళ్ళనుండి ఇదిగో, అదిగో అంటూ.... ఇక చదువుకోని ఈమెకూ..."

"ఆగు!... అక్కడే ఆగు... అందరికీ గవర్నమెంటు ఉద్యోగాలు కావాలంటే... మన పేద గవర్నమెంట్ ఎక్కడనుండి తెచ్చిస్తుంది? అందుకేగా స్వయం ఉపాధి పథకాలు పెట్టిందీ. మనిషన్నాక ఏ పని చేసుకోకూడదూ?.... చిన్న పౌల్ట్రీ ఫారం పెట్టుకోకూడదా? బీడీలు చుట్టుకోకూడదా?... చిన్న బంకు పెట్టుకోకూడదా? మగవాడే సంపాయించి పెట్టాలా?" ఆవేశపడింది జయ.

"అయిందా నీ ఉపన్యాసం? ఇక నా పేషెంట్స్‌ని నేను చూసుకోవచ్చా?"

"ఎప్పుడూ వుండే పేషెంట్స్‌గానీ అలా నాతోరా చూపిస్తాను దేశంలో ఎన్ని సమస్యలున్నాయో!"

"సమస్యలా? ఏదీ మచ్చుకి ఒక్కటి వదులు....!"

"జ్యోతీ! నీకు తమాషాగా వుందా? ఈ పేదరికాన్ని చూస్తే.... నాకైతే, ఏదో చేసేయాలనిపిస్తుంది."

"అయితే! నీ దగ్గర రెండు కోట్లున్నాయనుకో! ఒక కోటి నిరుద్యోగులకు దానం చేస్తావా?" ఉడికిస్తూ అన్నాను.

తల అడ్డంగా వూపింది జయ. "రెండు కోట్లుకాదు... ఇరవై రెండు కోట్లు ఇచ్చినా స్త్రీలు ఇలా నిస్తేజంగా వున్నంతవరకూ ఈ నిరుద్యోగ పర్వం పూర్తి కాదు. ఎవరికివాళ్ళే తమకు తోచినపని తాము చేసినప్పుడు... అప్పుడు ఈ కన్నీళ్ళు ఇంకిపోయేది."

"వెల్! కాదనను. కానీ జయా, కన్నీళ్ళు ఒక్క ఆకలితోనే రావు. అత్తలవల్ల,

ఇరుగుపొరుగువల్ల, ఆఖరికి భర్తలవల్ల కూడా కన్నీళ్ళొస్తాయి. మా పక్కింటావిడ ఆమె భర్త తెచ్చే జీతం చాలక, వెంకటగిరికెళ్ళి కొన్ని చీరలు తెచ్చి, మారు బేరానికి, మా అందరికీ అమ్మి, ఏదో కొంత సంపాయించుకుంటోంది. ఆ సంగతి తెలిసిన ఆమె భర్త మహాశయుడు 'ఏం? నీ మొగుడు చచ్చాడా?' అని సభ్యత మరిచి గొడ్డును బాదినట్టు బాదాడు పాపం!"

"అమ్మ పెట్టాపెట్టదు. అడుక్కుతినానివ్వదని.... ఈ మిథ్యా భేషజాలు అతని లోనే కాదు, చాలామందిలో వున్నాయి. వీటిని పోగొట్టాలి. అందుకే ఈ నెల 30, 31వ తేదీలలో 'సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఫార్ ఉమన్' అని, ఒక సదస్సు ఏర్పాటు చేసాను. ఆ రోజు మీ పక్కింటాయన్ని కూడా తీసుకుని నువ్వు రావాలి. ఓ.కె... నే వెళతాను. ఇక నీ పేషెంట్స్‌ని చూసుకో...."

"ఆగాగు! నీ సదస్సులో స్టేజీమీద నువ్వేం చెప్తావో... నాకిప్పుడే చెప్పు. రేపు ఉదయం, ఆర్థికమైన ఇబ్బందులతో, మానసిక ఆరోగ్యాన్ని కోల్పోయిన ఒక పేషెంట్ చెకప్‌కి వస్తోంది. ఆమెకు మందివ్వడంకంటె, ఒక పరిష్కారం చూపించడం మంచిదని పిస్తోందిప్పుడు... ప్లీజ్... కూర్చో!" జయ మొదలెట్టింది.... నిల్చునే....

"ఏమీ లేదోయ్! ఆర్థికమైన ఇబ్బందులున్న భార్యలలిస్టు తీసుకుందామను కుంటున్నాం, వాళ్ళవాళ్ళ వయసుల్నిబట్టి వాళ్ళ ఆరోగ్య పరిస్థితినిబట్టి... వాళ్ళ ఉత్సాహాన్ని బట్టి, కొంత స్వయం ఉపాధి పథకాలగురించి చెప్పి, వాళ్ళు సమ్మతిస్తే, వాళ్ళ చేత అప్లికేషన్స్ పెట్టించి, బ్యాంక్ ద్వారా లోన్ ఇప్పించే ఏర్పాట్లు చేయాలన్నదే మా ఉద్దేశం."

"స్వయం ఉపాధి పథకం క్రింద ఎంతవరకూ లోన్ యిస్తారు?"

"ఎంతయినా ఐదువేలనుండి, కొన్ని లక్షలదాకా!"

"లక్షలే....!! వీళ్ళు ఎగేస్తే....?"

"బ్యాంకు ఊరికే కళ్ళు మూసుకునిగాని ఇచ్చేస్తుందా ఏం? వాళ్ళ ఆస్తులు మార్ట్‌గేజ్ చేసుకునిగానీ ఇవ్వరు."

"ఆస్తులు తాకట్టు పెట్టుకునా?... నా పేషెంటుకు తాకట్టుపెట్టడానికి తాళి బొట్టు కూడా లేదు."

"ఇలాంటివాళ్ళకు... ఎలాంటి హామీ లేకుండానే ఐదు, పది వేలదాకా యిస్తారు."

"వెరీగుడ్! ఇవన్నీ నీకెలా తెలుసు? నాకు నువ్వు చెప్పేదాకా తెలియదు...!"

"నువ్వు బావిలో కప్పవులే. అందుకే, నాతో రమ్మంటున్నాను. కళ్ళు తెరిచి ఈ సమాజాన్ని చూడమంటున్నాను."

"నా వల్ల కాదుగానీ, ఇది చెప్పు. ఆ పదివేలు వూరికే యిస్తారా? అప్పుగా యిస్తారా?"

"మంచిదానివే! వూరికే ఎందుకిస్తారు? అది అప్పే."

"వీళ్ళు తిరిగి యివ్వకపోతే, లేదా కావాలని ఎగేస్తే?"

"ఇవ్వలేని పరిస్థితి అయితే... కొన్ని సంవత్సరాలు చూసి వదిలేస్తారు. మంచి రాబళ్ళు వుంటే, ఎగేస్తే ఊర్కోరు. బిజినెస్‌ని సీల్ చేస్తారు."

'కాలేజీలో కూడా, కాలు మోపని జ్యోతిలో ఇంత మనోధైర్యం, ఏదో చేయాలనే తపన ఎలా వచ్చాయో!' ఆశ్చర్యపోయాను.

"మా పేషెంటు యెగేయదులే. ఓ పదివేలు ఇప్పించు పాపం. ఓ కుట్టుమిషను కొనుక్కుని, కొద్దో గొప్పో సంపాయించుకుంటుంది."

"కొద్దోగొప్పో ఏవిటి? ఏ పనికైనా ఈ రోజుల్లో డిమాండ్ వుంది.... పోనీలే, నీ దగ్గరకొచ్చినందుకు ఓ ప్రయోజనం సంపాయించాను. ఆమెను నన్ను కలుసుకోమని చెప్పు. నీ పేషెంట్లు ఇప్పటికే నన్ను తిట్టుకుంటుంటారు. మర్చిపోకు... 30వ తేదీ రా..."

* * * * *

"ఏం వదినా, ఇంతాలస్యమయిందీరోజు" ఎదురొచ్చింది.... మా ఆడబిడ్డ.

"ఓ.పి. ఎక్కువగా వుంది. నువ్వు భోంచేయలేదా?"

"లేదు.... అందరం కలిసి భోంచేద్దాం. అన్నయ్య కూడా వచ్చి అరగంటయ్యింది."

"అరె! ఆయన కూడా వచ్చేసారా?" హడావిడిగా లోపలికెళ్ళాను.

* * * * *

"వదినా! పెద్ద వదిన వచ్చిపోయింది ఈ రోజు" భోంచేస్తూ మధ్యలో అంది మధుమతి.

"అయ్యో! నేను వచ్చేదాక వుండమనకపోయావా?"

"ఎంతోసేపు వుండలేదు... బ్యూటీపార్లర్ పెడుతోందట. ఇక్కడ ఎవరో ఒక అమ్మాయి ట్రెయినింగ్ అయి ఖాళీగా వుందట. ఆ బ్యూటీషియన్‌ని తీసుకెళ్ళడానికి వచ్చింది."

"చాలా ఎక్విప్‌మెంట్ కొనాలే..." సాలోచనగా అన్నాను.

"లోన్ శాంక్షన్ అయిందట వదినా, బ్యాంక్ ఇస్తోందట..."

"ఓహో అలాగా! పోనీలే పాపం. ఇంట్లో కలర్ టి.వి. అన్నాలేదు. కొనుక్కుంటారు. కాస్త సంపాయించుకున్నాక."

నేను తలెత్తేసరికి, మావారు కోపంగా చూస్తున్నారు.

"ఏం? కలర్ టీవీలు లేకపోతే తిండికిగానీ జరగడం లేదా? ఏమి మాట్లాడవు? మనిళ్ళలో ఆడవాళ్ళేమిటీ?.... ఇలా బజారుకెక్కి బిజినెస్ చేయడమేమిటి?" నేను క్షణంసేపు మౌనంగా వున్నాను.

"అదేవిటండీ? అలా అంటారు? నేను ప్రాక్టీస్ చేయడంలేదా?"

"ప్రాక్టీస్ అంటే... అది గౌరవప్రదమైంది. బిజినెస్ అంటే రకరకాల మనుషులొస్తారు."

ఆయన అన్నం తినడం సగంలోనే ఆపేసి లేచి వెళ్ళిపోయారు. నేను లేచి ప్లేట్‌లో అన్నం కలుపుకుని, ఆయన రూంలోకి వెళ్ళ బోతున్నాను. మా స్నేహితురాలు కీర్తి లోపలికి వచ్చింది.

ఆమెను పలకరించి వెళ్ళి, శ్రీవారిని ప్రసన్నుణ్ణి చేసుకోవచ్చని ప్లేట్ అక్కడ వుంచాను. కీర్తిని అంత సంతోషంగా, అంత కళకళలాడ్తూ, నేనెప్పుడూ చూడలేదు.

"రా! కూర్చో! భోంచేద్దువు గానీ...."

"ఓ! కీర్తిగారా? మీ దగ్గరకు నేనే రావాలనుకుంటున్నాను. మా అన్నయ్య ఢిల్లీ నుండి ఫ్లవర్ పాట్, బ్రాస్ కృష్ణుడి బొమ్మ తెచ్చారు. వాటిని మా యింట్లో ఎక్కడ అరేంజి చేస్తే బావుంటుందో చెప్పండి. మీరైతే బాగా చెప్తారు...." వాష్‌బేసిన్ దగ్గరనుండి వస్తూ అంది మధు.

"వూరికే చెప్పనోయ్! ఇంటీరియర్ డెకరేటర్‌ని... మీరు నాకు ఫీజు ఇవ్వాలి మరి..."

"ఇదెప్పటినుండి....?"

"ఊరికే లేవోయ్! జోక్ వేసానంతే. మీ దగ్గర డబ్బులు తీసుకుంటానా? ఈ మధ్య 'ఇంటీరియర్ డెకరేటర్' బోర్డుకట్టి ఒక ఆఫీస్ ఓపన్ చేసాను.... అలా తెల్లబోకు... 'నేనేమిటి? ఆఫీస్ ఓపన్ చేయడమేమిటి?' అనుకుంటున్నావా?"

"ఇన్ని రోజులూ నాకీ ఆలోచన రాలేదు. మావారు తెచ్చే జీతంతో సర్దుకుంటున్నాను. అలాగే తృప్తిపడుతూ వచ్చాను. కానీ నా సర్దుబాటు మనస్తత్వంతో నేను నా పిల్లలకి సరైన తిండికూడా పెట్టలేకపోయేదాన్ని."

"ఈ మధ్య మా వారితో సంప్రదించి, లోన్ తీసుకుని, ఇంటీరియర్ డెకరేషన్ ప్రారంభించేను. అప్పుడే నలుగురికి చేసాను కూడా. నువ్వు కూడా ఎవరికైనా చెప్తావని, నీకు చెప్పిపోదామని ఇలా వచ్చాను జ్యోతీ...."

పోనీలే పాపం! బాగుపడింది. మనసులోనే సంతోషపడ్తూ అడిగాను "చార్జెస్ ఎంత చెప్పమంటావు?"

"ఎంతిచ్చినా సరే ప్రస్తుతానికి. కాస్త నిలదొక్కుకున్నాక ఫిక్సెడ్ రేట్ పెట్టుకుంటాను."

"ఇంటిని సుందరంగా పెట్టుకోవడానికి ఇంటీరియర్ డెకరేటర్స్ హెల్ప్ తీసుకునే వాళ్ళు బాగా వున్నవాళ్ళే అయ్యుంటారు. బాగానే తీసుకోవచ్చు... మొదట మా ఆడబిడ్డ దగ్గర వసూళు చెయ్యి."

"ఇప్పుడు కాదు. మధుకి పెళ్ళయ్యాక..." నవ్వుతూ అనేసి, ఇదివరకులా కాకుండా, ధైర్యంగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయింది కీర్తి.

నేను మావారిని మార్చడానికి గదిలోకి నడిచాను.